# అది అంతే...

ఇది ఇలా జరగటానికి అది కారణం అని అన్ని విషయాల్లోనూ చెప్పడానికి లేదు. దానికి హేతువాది ఒప్పుకోడు; జరిగిం దానికి మనం తికమక పడుతుంటే మనకి అర్థం కాని కారణాలతో తన వాదాన్ని సమర్థించుకుంటాడు. నిజానికి ఇది యింతే అని సమాధాన పడటంలో మనశ్శాంతి వుంటుంది.

ఓ కాంక్రీట్ ఎగ్జాంపుల్ చెప్తాను. లెటర్ రాద్దామని లెటర్ పేడ్డూ బాల్ పాయింట్ పెన్నూ సిద్ధం చేసుకున్నాను. లెటర్ రాయడానికి శ్రీకారం చుట్టేను.... "మై డియర్" వరకూ వొచ్చేను. ఇంతలోకే టెలిఫోన్ ఆర్తనాదం వినబడింది. రిసీవర్ అందుకున్నాను. ఫలానా పని కావాలంటే ఫలానా వాడికి టెలిఫోన్ చెయ్యాలనీ, వాడిది ఫలానా టెలిఫోన్ నెంబరనీ మా ఫ్రెండొకడు తారక మంత్రోపదేశం చేశాడు. వెంటనే ఆ పేరు నెంబరూ నోట్ చేసుకుందామని బాల్ పాయింట్ పెన్ తీసి కాగితంమీద పెట్టేను. అది రాయడం మానేసింది. శత విధాల ప్రయత్నించేను. ససేమిరా, రాయనంది. ఆ పేరూ నెంబరూ ఎక్కడ మరిచిపోతానో నన్న భయంతో ముచ్చెమటలూ పోస్తున్నాయి. గత్యంతరం లేక అగ్గిపుల్ల తగలేసి ఆ మసి వున్న చివరతో లెటర్ పేడ్ మీద తాటికాయంతక్ష రాల్తో రాసి, నా సమయస్ఫూర్తికి నన్ను నేను అభినందించు కుంటూ, ఉత్తరం రాసే యోగం ఈ నాటికి లేదని, టెలిఫోన్ చెయ్యడానికింకా అరగంట టైముండటం చేత, గెడ్డం గీసుకుని స్నానం చేసి నా బల్ల దగ్గర కొచ్చేను. అదే కాగితం మీద అదే బాల్ పాయింట్ పెన్‌తో ఒక్క అక్షరం ఒక్క అంకె కనబడకుండా మా మనువరాలు పిచ్చి గీతలు గీసేసింది. ఆ బాల్‌పాయింట్ పెన్ అలా ఎందుకు ప్రవర్తించింది? కారణం తెలీదు. జస్ట్.... అది అంతే.

గత ముప్ఫయేళ్ళుగా నేనూ మా ఆవిడా అన్యోన్యంగా వుంటున్నట్టే లెఖ్ఖ. ఏవైనా కోపతాపాలొచ్చినా రెండుమూడు గంటల్లోనో రెండు మూడు రోజుల్లోనో రాజీపడేవాళ్ళం. ఇటీవల ఆవిడ ప్రవర్తనలో మార్పు కనబడుతుంది. మాట వరసకి చెబుతున్నాను. నాతో ఏదైనా మాట్లాడాలనుకోండి, ఎంత

అర్జెంటు పనున్నా తనే నా దగ్గర కొచ్చేది. ఈ మధ్య "ఏమండీ, ఓసారిలా వొస్తారా?'' అని పిలవడం మొదలెట్టింది. ఫర్గెటిట్ అదీ నేను పట్టించుకోలేదు. కాని అనేక సందర్భాల్లో ''ఏమిటండీ చిన్న పిల్లాడిలాగ'' అనో ''ఈ వయస్సులో....'' అనో, ''ఏభయేళ్ళుదాటినా'' అనో దీర్ఘాలు తియ్యడం మొదలెట్టింది. ఎవడి వయస్సు వాణ్ణి మళ్ళపెడుతుందంటే చెప్పలేను కాని, ఈ ముప్పయ్యేళ్ళ బట్టీ రోజూ ఒకటి రెండుసార్లు అద్దం చూసుకుంటూనేవున్నా, నాలో పెద్ద మార్పేమీ కనబడలేదు. కొంచెం జుట్టు అక్కడక్కడ నెరవడం, పల్చబడటం తప్పిస్తే నేను అప్పుడూ యిప్పుడూ, ఎప్పుడూ ఓలాగే వున్నాననిపిస్తుంది. ఎటొచ్చీ ''మీరింకా సర్వీసులో వున్నారా, రిటైరయారా?'' అని ఎవరేనా అడిగినప్పుడు అద్దంలో మరింత పరకాయించి చూస్తే మాత్రం వెనకటి నునుపు తగ్గి అక్కడా అక్కడా మొహం మీద ముడతలు కనబడతాయి.

నిజానికి మా ఆవిడలో వయస్సు కొట్టొచ్చినట్టు కనబడుతుంది. దానికి సాయం మేకప్ చేసుకోవాలన్న శ్రద్ధలేదు. అసలు రొమాంటిక్ యింపల్సే మాయమైందా అనిపిస్తుంది. ఉన్నంతలో బ్యూటిఫుల్‌గా వుండొచ్చుగా? అబ్బే! అసలు ఆ కట్టూ బొట్టూ తీరులోనే ముసలి వాలకం కొట్టొచ్చినట్టు కనబడుతుంటే ఎంత సేపూ పూజలూ, పునస్కారాలు, పండగలూ, పేరంటాలు- పెద్ద ముత్తయిదువు లాగ! ముప్పయ్యేళ్ళ బట్టి తనని నమ్మిన భర్తున్నాడు, యింకా ఉషారుగా చలాకీగా వున్నాడు, ఆయన అభిరుచికి సరదాలకి తగ్గట్టు కాస్త కాకపోయినా కాస్తయినా ఫేషన్‌బుల్‌గా వుండాలన్న ధోరణే లేదు. ఈ మార్పంతా బాల్ పాయింట్ పెన్‌లో లాగ ఒక్కసారి రాలేదు. స్టెప్ బై స్టెప్ వొచ్చింది. కారణం నాకు తెలీదు. జస్ట్ డోంట్ నో.

సమ్‌థింగ్ హేజ్ టు బి డన్....ఏదో చెయ్యాలి ఏదో చెయ్యాలి అనుకోవడమే కాని చెయ్యదల్చుకున్నది చేసే ధైర్యం లేదు, చెయ్యలేక పోవటంతో సమాధానపడే సహనమూ లేదు ఈ మధ్యనే మా అబ్బాయికి ఈ వూళ్ళోనే వుద్యోగం రావడంతో పరిస్థితి శృతి మించిపోయింది. ఈ మధ్య నేను సరదాపడి ఓ ఫారిన్ రిస్ట్ వాచి, ఓ మంచి నిరొలాక్ సూట్‌కేసు, ఓ కాశ్మీర్ శాలువా ఒక దాని తర్వాత ఒకటి కొన్నాను. ఆ ప్రతి వస్తువూ యింటికి తీసుకురాగానే సర్గిగా ఆ వస్తువు కోసమే మా అబ్బాయి గిలగిల్లాడిపోతున్నట్టూ అంచేత దాన్ని మా అబ్బాయికే యిచ్చెయ్యమనీ మా ఆవిడ తన అమూల్యమైన అభిప్రాయాన్ని

వెలిబుచ్చింది. ఇచ్చేశాను. ఇచ్చినందుకు నేను బాధపడటం లేదు. ''అలాంటిది వాడికీ కావాలిట దబ్బివ్వండి కొనుక్కుంటాడు'' అన్నా సంతోషిద్దును. "ఇంకోటి కొనుక్కురాలేక పోయారా, పాపం! వాడికీ ఒకటుండును" అన్నా రెండో పక్షం. ''అది వాడికిచ్చేసి మీరింకోటి కొనుక్కోండి'' అన్నా పోనీ అది మూడో పక్షం. కాని మా ఆవిడ అభిప్రాయంలో ''అది మీకెందుకు, వాడిక్కావాలికాని!" అన్న ధోరణి ధ్వనిస్తుంది. ''వాట్ డజ్ షి మీన్ బైయిట్?''

ఇంటికి పెందరాళే వొచ్చిన ఓ రోజున తిండానికేమైనా వుందా అంటే ''వేళకాని వేళ యిప్పుడేముంటుంది? పోనీ, వొచ్చేటప్పుడు హోటల్లో తినిరాలేక పోయారా?'' అంది పావుగంట తర్వాత మా అబ్బాయొచ్చి ''అమ్మా! ఆకలేస్తుంది. తిండానికేమీలేదూ?'' అని అడిగేడు. ''ఉప్మా చేసి పెట్టనా?'' అని అడిగింది. ''కారం కారంగా పకోడీ లేసి పెట్టు అన్నాడు. చేసింది వాడితో బాటు నాకూ పడేసింది. అది వేరే సంగతి. ఇట్ ట్రీట్ మెంట్.

నా కోసం ఎవళ్ళేనా గెస్టు లొచ్చి నేను కాఫీ పెట్ట మంటానను కోండి, ''ఇప్పుడా! కాఫీయా! నా వల్లకాదు. మీకు మీగెస్టులకు ఓ దణ్ణం. ప్రాణాలు తోడేస్తున్నారు.'' అని విసుక్కుంటుంది. దాంతో పని మనిషికి ఫ్లాస్కిచ్చి దొడ్డిదారిన హోటల్ కి పంపించి కాఫీ తెప్పించిన సంఘటన లెన్నో వున్నాయి. అదే మావాడు గాలి దుమారం లాగ ఇంట్లో జొరబడి "అమ్మా మా ఫ్రెండొచ్చారు. కొంచెం కాఫీ పెట్టవే'' అంటే ''నీకు మీ నాన్న గారికి ఫ్రెండ్స్ కి లోటేముంటుంది! ఎంత మంది?'' అని అడిగి వెంటనే తయారు చేస్తుంది. వాటీజిట్ ఏడింగ్ ఇన్సల్ట్ టు ఇంజరీ!

నేను యింటికి రావడం లేటయితే విసుక్కుంటూ విసిగిస్తూ నూట తొంభయి ప్రశ్నలేస్తుంది. వాడర్థరాత్రి వేళొచ్చినా సరే ''ఎక్కడి కెళ్ళావురా యింత పొద్దుపోయిందే?'' అని మాట వరసకు అడిగి, వాడెలాగా సమాధానం చెప్పడని తెలిసి ''తొరగా కాళ్ళూచేతులూ కడుక్కో, కూరముక్కలన్నీ కొయ్యముక్కల్లా వుంటాయి, తొరగా తెములు'' అంటూ ప్రేమ ఒలకబోస్తుంది. ఈజిట్ నాట్ ది లిమిట్!

మా అబ్బాయి పట్ల మా ఆవిడ ప్రవర్తించే తీరు నేను గమనించీ కూడా ఏ విధంగా నోరు మూసుకు వూరుకుంటున్నానో అదే విధంగానే నాపట్ల మా

ఆవిడ చూపెట్టే నిర్లక్ష్యాన్ని వాడు' కూడా గమనిస్తూనే వుంటాడు కాని వాడు మాట్లాడడు. ఉన్నవాళ్ళం ముగ్గురం. వాళ్ళిద్దరూ ఏకమౌతారు కనుక వాళ్ళదే మెజారిటీ. ఇదీ పరిస్థితి పీడికి పూన్నించి ట్రాన్స్‌ఫరయి పోతే బాగుండును, నాకి సవతి పోరుండదు. అనుకున్న క్షణాలు కూడా లేకపోలేదు. ఈ వయస్సులో ఆవిడ మా అబ్బాయికి తల్లే కాని నాకు పెళ్ళాంకాదు. ఈ యింటికి నేను యజమానిని మొర్రో అన్నా అది అరణ్య రోదనే అవుతుంది. మా యిద్దరి మధ్యా భార్యా భర్తల సంబంధం అనురాగం యింతటితో సరా? దాంపత్య జీవితానికిదే చరమగీతమా? ఇలా చాలా సార్లు ఆలోచించేను. ఊహూ....ఇది యింతే. యాంత్రికంగా రోజులు దొర్లించు కోటాని కలవాటు పడటం తప్ప వేరేదారి కనబడలేదు. కాని ఎన్నాళ్ళిలాగా? ఇట్ జస్ట్ కాంట్ గో అన్ లైక్ దిస్!

* * *

మా అబ్బాయికి పెళ్ళయ్యేక మా ఆవిడ పుత్రవాత్సల్యం శిఖరాగ్రం చేరుకుంది కోడల్ని యింటిపని వంట పనీ చెయ్య నిచ్చేదికాదు. కోడలి ముస్తాబు, లిప్‌స్టిక్కూ, వేనిటీ బేగ్ చూసి మురిసి పోయింది. తమ జీవితంలో తీరని కోంకల్ని పిల్లల ద్వారా తీర్చుకుని తల్లి దండ్రులు స్వాప్నికమైన సంతృప్తి పొందుతారను కుంటాను మా ఆవిడ కాపరానికి రాగానే మా అమ్మ చీపురూ, గరిటె, బిందె అందించింది. మా అమ్మకి మా బామ్మా అంతే చేసుంటుంది. భార్య భర్తతో టింగు రంగా మంటూ ఊళ్ళో సినిమాలూ, పార్కులూ, బజార్లు చుట్టబెట్టాలి కాని, గుడి గుడి గుంచం అంటూ యింట్లోనే పడుండడ మేమిటి అనే ఆలోచన తీరని కోర్కెగా మా ఆవిడ తలలో దాక్కుని వుంటుంది. నిజానికి మేము వేరే కాపురం పెట్టుకొనే టప్పటికీ మా అబ్బాయికి నాలుగో యేడు: అంచేత ఆమె కన్న కలల కిప్పుడు మా అబ్బాయి అమ్మాయి ప్రతిబింబాలు. అఫ్‌కోర్స్ ఇటీజ్ బట్ నేచురల్.

మా అబ్బాయి ఫ్రెండ్సూ, మా కోడలి తాలూకు బంధువులూ మా ఆవిడ చేసే అతిథిసత్కారాలకి మెచ్చుకుంటుంటే ఆవిడ ఆనందంతో చిందులు తొక్కడంలో పరవశమై పోతుంది. ఆవిడ తన సొంతసుఖాన్ని గురించి పట్టించుకోదే అని నా బాధ. ఈ దాడికి తట్టుకోలేక ఇంటికి ఆలస్యంగా రావడం అలవాటు చేసుకున్నాను. ఇంటి కొచ్చేటప్పటికి, ఎవరెవరొచ్చి నేను లేకపోవడం వల్ల నిరు

త్సాహపడ్డారో, వాళ్ళకి తను ఎంత నేర్పుగా సమాధాన పరచి పంపిందో దండకంలా చదివేది. ''రోజూ సాయంత్రం పూట వాళ్లిద్దరూ టివి చూడ్డానికి వాడత్తారింటికి పోతున్నారు. ఓ టివి కొని పడెయ్యండి, వాళ్ళిక్కడే వుండి చూస్తారు" అంది ఓ సాయింత్రం. మావాడు నాగపూర్‌లో చదువుకునే రోజుల్లో ఓ టివి కొందామనుకుంటే ఎందుకు లెద్దురూ అన్నదీ తనే. మా ఆవిడ పోరుపడలేక ఓ టివి కొని పడేశాను. వాటెల్స్ కెన్నై డూ!

''మీరు కూడా రోజూ ఆలస్యంగా వొస్తున్నారేమిటండీ! ఒక్కర్తినీ ఏమీ తోచక చస్తున్నాను'' అంది మా ఆవిడోరోజున. నాకీధోరణి అర్థం కాలేదు. "రోజూ వూరంతా తిరిగి చూసే వింతలేముంటాయిండీ! వీడూ ఆ అమ్మాయి ఈ వూళ్ళోనే పుట్టి పెరిగారాయిరి!" అంది యింకో రోజున. "పెళ్ళై మూణ్ణెల్లయింది. పట్టుమని పదిరోజులైనా రాత్రిళ్ళు యింటికి భోజనానికి రాలేదు: వాళ్ళింటికి విందంటాడు. వీళ్ళింటికి విందంటాడు. ఫ్రెండ్సంటాడూ పార్టీలంటాడూ! ఏమిటండీ ఈ తిరుగుళ్ళు! వాడికి తెలియక పోతే ఆ అమ్మాయి కేనా యింగిత జ్ఞానముండొద్దు? ఇలాగే అలవాటయితే వాడికొచ్చే జీతం ఈవిడగారి షోకులకీ సరదాలకీ షికార్లకీ సరిపోయేలా వుంది'' అంది మరో రోజున. నేను మాట్లాడలేదు. ఇప్పుడు వాళ్ళిద్దరూ ఓ పక్షం. మా ఆవిడో పక్షం. నేను తటస్థం. ఇప్పుడు నేను నోరు మెదిపేనంటే ఏదో పక్షాన్ని సపోర్టు చెయ్యాలి. అంటే ఏదో పక్షంతో కోరి కజ్జా పెట్టుకోవాలి. పైగా దిస్ ఈజ బ్రేక్ త్రూ ఐ వజ్ వెయిటింగ్ ఫర్!

నిజానికి వాళ్ళిద్దరిలోనూ అంత బరితెగించిన ప్రవర్తన నాకేమీ కనబడలేదు. ఆ అమ్మాయి చదువుకుంది. అత్తగారు వంట చెయ్య నివ్వటం లేదు. పగలల్లా కాలక్షేపానికేదో పుస్తకం చదువుకుంటూ కూర్చుంటుంది. రోజూ సాయంత్రం టివి చూస్తూ కూర్చోమంటే విసుగ్గానే వుండి ఏదో బయటికి పోబుద్దేస్తుంది. లేకపోతే మాలాగ పడక్కుర్చీలో నడుం వాలుస్తారా! మాతో ఎంతసేపు మాట్లాడుతూ కూర్చుంటారు, ఏం మాట్లాడుతారు? "నాకు వీళ్ళధోరణేమీ నచ్చలేదండీ! పగలల్లా పుస్తకం పట్టుక్కూర్చుంటుంది. సాయింత్రం అయ్యేటప్పటికీ ముస్తాబై సిద్ధంగా వుండి వాడు రాగానే యిద్దరూ ఏమి గుసగుసలాడుకుంటారో తెలీదు, పావుగంటలో వాళ్ళిద్దరూ స్కూటరెక్కి తుర్రుమంటారు. మీరూరుకుంటే లాభం లేదు. వాళ్ళిద్దర్నీ గట్టిగా కేక వెయ్యండి.'' ఇదొకరోజు

బాగోతం. తనే కేక వెయ్యొచ్చుగా! ఊహు .. నేను కేక లెయ్యాలిట! నో ఫియర్స్! నాట్ మీ!

నా సహకార నిరాకరణోద్యమ ఫలితంగా, కొడుకు నేమీ అనలేక మా ఆవిడ, పగలల్లా ఖాళీ కదా, కోడలిమీద, సన్నాయినొక్కులతోనో మంద లింపుతోనో అస్త్ర ప్రయోగం చేసినట్టుంది. అంచేతనే అత్తాకోడళ్ళ మధ్య చిరు నవ్వులు కరువయ్యేయి. మాటలు కూడా పుల్లవిరుపుగా వుంటున్నాయి. మావాడి మొహం కూడా కందగడ్డలా వుంటూ నాలాగే మౌనముద్ర అభ్యసిస్తున్నాడు. టెన్షన్ పెరుగుతుందే కాని, తరగటం లేదు. "అమ్మా! యమునకి మా ఆఫీసు పక్కనే వున్న స్కూల్లో టీచర్‌గా వుద్యోగం వచ్చింది. ఎల్లుండి చేరుతుంది" అన్నాడు మావాడు ఓ చల్లని సాయంత్రం టెన్షన్‌ని ద్విగుణీకృతం చేస్తూ.

"అంటే-వుద్యోగంలో చేరాలనుకోడం, వుద్యోగం వెతుక్కోవడం, చేర డానికి ముహూర్తం పెట్టడం.... అంతా అయిపోయిందన్న మాట! ఇంక రేపణ్ణుంచి నీకూ నీ పెళ్ళానికీ చెరో కేరియర్‌లోను అన్నం సర్ది పెట్టి సాగనంపుతూ వుంటాను! ఇందుకే కదా నేబతికున్నాను?" అంటూ గట్టు తెంచుకున్న నదీ ప్రవాహంలాగ విరుచుకుపడింది, మా ఆవిడ.

"చూడమ్మా, నీకీమధ్య కోపం రుసరుసలూ ఎక్కువయ్యేయి. యమున గోళ్ళు గిల్లుకుంటూ యింట్లో కూర్చోడం మా యిద్దరికీ యిష్టంలేదు. అందుకే ఆఫీసు దగ్గరే మా కొలీగ్ వుంటున్న యింట్లో ఓ పోర్షన్ అద్దెకు తీసుకున్నాం. యమున వంటా చేస్తుంది, ఉద్యోగం చేస్తుంది. మేము రోజూ సాయంత్రం యిక్కడి కొస్తూవుంటాం" అన్నాడు మావాడు యింక చెప్పేది ఏమీలేదన్నట్టు.

నాకు వాళ్ళ నిర్ణయంలో దోషమేమీ కనబడలేదు. వాళ్ళ బతుకులు వాళ్ళు బతకడం నేర్చుకుంటామంటున్నారు. మా ఆవిడకి ఆప్యాయత తెల్సుకాని అర్థ శాస్త్రం తెలీదు. హృదయం పని చేసినట్లు మెదడు పని చెయ్యదు.

సాయింత్రం కావాలనే కొంచెం ఆలస్యంగా వొచ్చేను. ఇల్లు వెలవెల బోతూవుంది. హాల్లో అడుగెట్టగానే మా ఆవిడ వాలకంచూసి విస్తుపోయేను. తలలో పువ్వులూ, మొహాన్ని పౌడరూ, చక్కగా ముస్తాబై దర్శన మిచ్చింది. ఎటొచ్చీ ముక్కూ కళ్ళూ ఎర్రబడ్డాయి, ఓ సారి యిల్లంతా కలియజూసి వొచ్చి సోఫాలో చతికిలబడ్డాను. రెండు నిమిషాల తర్వాత మా ఆవిడ టిఫిన్ ప్లేటూ మంచినీళ్ళ గ్లాసుతోనూ ప్రత్యక్షమైంది. వాట్ ఎ ట్రాన్స్‌ఫర్మేషన్!

"అమధ్య కొన్న సూట్ కేసూ, కాశ్మీర్ శాలువా యిక్కడే వొదిలేసి నట్టున్నాడు!" అన్నాను.

"అవి మీకోసం మీరు సరదాపడి కొనుక్కున్నవి. తీసుకెళ్ళనివ్వలేదు" అంది, చెమర్చిన కళ్ళు తుడుచుకుంటూ.

"వాళ్ళకోసమేకదా కొన్నాం, ఆ టివి తీసుకెళ్ళమనవల్సింది" అన్నాను.

"ఎందుకండీ! ఇద్దరూ సంపాదించుకుంటారు. కొనుక్కుంటారు, ఏడాదిలో మీరు రిటయిరవుతారు. మనకి మాత్రం కాలక్షేపం వుండొద్దూ! అయినా అద్దాలలో బిడ్డలుకాని రెక్కలొచ్చేక, అందులోనూ పెళ్ళయ్యాక....', అంటూ కాఫీ పట్రావటానికి లాగుంది వొంటింటివైపు వెళ్ళింది.

మా ఆవిడ ప్రవర్తనలో అప్పుడొచ్చిన మార్పుకీ యిప్పుడొచ్చిన మార్పుకీ కారణాలు తెలియకపోయినా ఈ సామాజిక వ్యవస్థలో పెళ్ళనే సాంప్రదాయం మరికొన్నాళ్ళు నిలుస్తుందన్న నమ్మకం కుదిరింది. *

(ఆంధ్రభూమి మాసపత్రిక, డిసెంబర్ 1984.)